సాక్షి చిత్తూరు

శనివారం। 18। మే। 2024



బోయకొండ గంగమ్మా.. పాహిమాం
శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో రాహుకాల అభిషేక పూజలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.
- 10లో



మరణంలోనూ వీడని బంధం
నగరి మండలం తడుకుపేట వద్ద జరిగిన ప్రమాదంలో స్నేహితులిద్దరూ దుర్మరణం చెందారు.
- 10లో



విమానంలో విద్యాకుసుమాలు
మాధనపాళెం హైస్కూల్ విద్యార్థులు నలుగురు విమానంలో విహారయాత్రకు వెళ్లారు.
- 10లో

న్యూస్‌రీల్

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ



డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 3 వ తేదీ వరకు జరుగుతాయని డీఈఓ దేవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, 2006 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల పకడ్బందీ నిర్వహణకు చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు జూన్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలలో 1561 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని డీఈఓ వెల్లడించారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎస్వీ సెట్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌ను శుక్రవారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును క్షుణంగా పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కౌటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అరిపుల్లా, డీఎస్పీలు పావన్‌కుమార్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో డైరెక్ట్ అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ :జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా మైనారిటీ శాఖ అధికారి చిన్నారెడ్డి వెల్లడించారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల్లో ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, పార్శిక్, బౌద్ధులు, జైను కులస్తుల విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయకుండానే అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంలోని మురకంబట్టు మైనారిటీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 63, 6వ తరగతిలో 55, 7వ తరగతిలో 48, 8వ తరగతిలో 47 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, కాస్మొటిక్ చార్జీలు, వైద్య సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 8712625058, 9441155061 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు

శరవేగంగా ఎన్‌హెచ్ పనులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎన్‌హెచ్ఎఐ పీడీ కార్తీక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ పనుల్లో భాగంగా బెతమంగళం నుంచి బైరెడ్డిపల్లె వరకు మొత్తం 25 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉండగా 15 కిలోమీటర్లు పూర్తి అయినట్లు పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె- బంగారుపాళ్యం 31 కిలోమీటర్లకు గాను 5 కి.మీ, బంగారుపాళ్యం–గుడిపాల మార్గంలో 29 కి.మీగాను 21.5 కి.మీ నిర్మించినట్లు తెలిపారు. చిత్తూరు–తచ్చూరు రోడ్డులో వరదారాజులపల్లె–కుమారారాజాపేట వరకు 43.8 కి.మీ నిర్మించాల్సి ఉండగా 25 కి.మీ పూర్తి చేశామన్నారు. కుమారారాజాపేట–వీరకావేరిరాజాపురం 17.58 కి.మీ గాను 1.6 కి.మీ, వీరకావేరిరాజాపురం–పొండవకం వరకు 34.66 కిలోమీటర్లకు గానూ 25 కి.మీ నిర్మించినట్లు ఆయన వివరించారు.

27 నుంచి వసంతోత్సవాలు

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారీ సమేతంగా వసంతోత్సవంలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు, సీతాలక్ష్మణ హనుమ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించనున్నట్లు వివరించారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే వసంతోత్సవం అంతరార్థమని తెలిపారు. ఒక రోజు సేవలో పాల్గొనేందుకు దంపతులు రూ.516 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

• పరిణయ సంబరం





తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో శుక్రవారం శ్రీపద్మావతి పరిణయోత్సవాలు నయనానందకరంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. భూలోక వైకుంఠాన్ని తలపించేలా అత్యంత శోభాయమానంగా అలంకరించిన కల్యాణ వేదికపై తొలిరోజు ఎదుర్కోలు, పూలహారాలు మార్చుకోవడం, పూబంతులాట, నూతన వస్త్ర సమర్పణ తదితరాలు భక్త జన సందోహం నడుమ వేడుకగా సాగాయి. - తిరుమల

చిన్న పొరబాటు జరిగినా కఠిన చర్యలు

- కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు
- చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లల్లో చిన్న పొరబాటు జరిగినా చర్యలు కఠినంగా ఉంటాయని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు ఎస్పీ మణికంఠతో కలిసి ఆయన ఎస్వీ సెట్‌లోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పరిశీలించారు. అనంతరం ఆర్‌ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది, పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఐడీ కార్డు, ప్రొసిడింగ్ ఉత్తర్వులు ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉంటుందని తెలిపారు. 24 గంటల పాటు సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు ఏజెంట్లు వచ్చినప్పుడు రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకోవాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఎస్పీ మణికంఠతో చర్చిస్తున్న చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు

విధులు నిర్వహించేలా చేపట్టి, వారందరికీ ఐడీ కార్డులు జారీ చేయాలన్నారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ఏఎస్పీ అరిపుల్లా, కమ్యునికేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ నరసింహులు, ఏఆర్‌ఓలు శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను అనుసరించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో ఏర్పాట్లపై టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్‌లో జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టేబుల్స్ వేయించడం, సీసీ కెమెరాల ఏర్పాటు, బారికేడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పనపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించి లోపాలు ఉన్నట్లైతే సరిచేయాలన్నారు. సిబ్బంది వివరాలతో పాటు కంప్యూటర్లు, నెట్ తదితర సాంకేతిక అంశాలను జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని ఆయన తెలిపారు.

• జాతర అంబరం



కళాకారుల విన్యాసాలు

- తాతయ్యగుంట గంగమ్మకు తోటి వేషాలతో మొక్కులు
- అమ్మవారి సేవకు పోటెత్తిన భక్తులు

అమ్మా.. గంగమ్మ తల్లీ.. చల్లంగా చూడు అంటూ భక్తులు ప్రార్థించారు. జాతరలో భాగంగా మూడోరోజు శుక్రవారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ దర్శనానికి పోటెత్తారు. తోటి వేషాలు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని సేవించుకుని తన్మయత్వం చెందారు. ఈ క్రమంలో నాలుగోరోజు శనివారం కైకాల, రజక కులస్తులు అనువంశిక వేషాలతో పురవీధుల్లో సంచరిస్తూ పూజలందుకోనున్నారు. అనంతరం గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు.
- తిరుపతి కల్చరల్



గంగమ్మతల్లికి హారతి



తోటి వేషాల సందడి



రాక్షస సంహారం నృత్య రూపకం

ఇలాంటి క్షోభ ఎవరికీ రాకూడదు



చిన్నారుల తల్లి దండ్రులను ఓదార్చుతున్న మంత్రి రోజా

పుత్తూరు: బాబు, విజయ దంపతులకు కలిగిన క్షోభ మరెవరికీ రాకూడదని మంత్రి ఆర్కే రోజా భావోద్వేగం చెందారు. శుక్రవారం వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం గ్రామానికి వెళ్లి ముగ్గురు ఆడ బిడ్డలను పోగొట్టుకొన్న తల్లిదండ్రులను మంత్రి ఓదార్చారు. వారి బాధను చూడలేక ఆమె కూడా కంటతడి పెట్టారు. శివుడికి పూజలు చేసి, దీపారాధన చేస్తూ చెరువులో పడి మృత్యువాత పడ్డ చిన్నారులు రూపిక, చరిత, యుషిక మృత దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో గుండె రాయి చేసుకోవాలని, తాను అండగా ఉంటానని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. బాసటగా నిలవాలని గ్రామస్తులను కోరారు. అనంతరం అశ్రునయనాల మధ్య చిన్నారుల మృత దేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐకేఎస్‌తో వేదిక్ వర్సిటీ ఒప్పందం

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖకు చెందిన భారతీయ జ్ఞానపరంపర విభాగం (ఐకేఎస్)తో తిరుపతి ఎస్వీ వేదిక్ వర్సిటీ 'వైదిక వాఙ్మయ వ్యాసాల ప్రచురణ, తాళపత్ర గ్రంథాల డిజిటలైజేషన్‌పై సహాయ సహకారాలు అందిపుచ్చుకునేందుకు శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ వర్సిటీ అధ్యాపక పరిశోధకులు రాసే వైదిక వాఙ్మయ వ్యాసాలను అధిక సంఖ్యలో ప్రచురించేందుకు వీలుగా భారతీయ జ్ఞానపరంపర విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రాచీన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేసి ప్రజలకు ఉపయోగకరమైన, ప్రచురణ యోగ్యమైన గ్రంథాలను, లఘు గ్రంథాలను ప్రచురించేందుకు మరో ఒప్పందం కుదిరిందని వివరించారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ, ఐకేఎస్ సమన్వయ కర్త

అనంతరం జ్ఞానపరంపర విభాగ జాతీయ సమన్వయకర్త ప్రొఫెసర్ జి.సూర్యనారాయణమూర్తితో అంగీకార పత్రాలను మార్చుకున్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, ఆచార్య గోలి సుబ్రమణ్యశర్మ, ప్రొఫెసర్లు రాధేశ్యామ్, పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.



సప్తగిరి.. భక్తఝురి

నారాయణగిరి వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్ని నిండిపోవడంతో భక్తుల క్యూ శిలాతోరణం వరకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 76,369 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 41,927 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.63 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో శుక్రవారం భారీగా వర్షం కురవడంతో తిరుమలలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మాడవీధులు జలమయమయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు సెంటర్ల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జూన్ నెలలో జరుగనున్న ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు మున్సిపల్ హైస్కూల్ (గాండ్లపల్లి, చిత్తూరు), జెడ్పీ హైస్కూల్ (బాలికలు, పలమనేరు), జిల్లా జైల్ పరీక్ష కేంద్రం (చిత్తూరు), ఇంటర్మీడియట్ పరీక్షలకు పీఎన్‌సీ మున్సిపల్ హైస్కూల్ (సంతపేట, చిత్తూరు), ఏపీఎస్ డబ్ల్యూఆర్ (సంజయ్‌గాంధీనగర్, చిత్తూరు), లిటిల్ ఫ్లవర్ పాఠశాల (గిరింపేట, చిత్తూరు), మున్సిపల్ హైస్కూల్ (గిరింపేట, చిత్తూరు), ప్రభుత్వ హైస్కూల్(పలమనేరు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (కుప్పం)లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు కృష్ణవేణి జూనియర్ కళాశాల (చిత్తూరు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (పెనుమూరు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (కుప్పం)లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఈ ఆస్పత్రికి వస్తే నరకమే..!

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి వస్తే నరకమే అంటూ వైద్యుల తీరుపై బాధితులు ఆక్రోశానికి గురయ్యారు. శుక్రవారం కడుపునొప్పి తాళలేక పోవడంతో చిత్తూరు నగరం ప్రశాంత్ నగర్‌కు చెందిన అరవై ఏళ్ల వృద్ధురాలని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సిబ్బంది ఇంజక్షన్ ఇచ్చి..పడుకోబెట్టారు. మళ్లీ పట్టించుకోలేదు. తర్వాత ఆ వృద్ధురాలి ప్రాణం గాలిలో కలిసిపోయింది. దీంతో వృద్ధురాలి కుటుంబీకులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎప్పుడొచ్చినా ఆస్పత్రిలో ఐసీయూ వార్డు లేదంటారని, డాక్టర్లు ఉండరని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా అమ్మకు ఇంట్లో ప్రాణం పోయుంటే బాగుంటుంది.. ఈ గబ్బుపట్టిన ఆస్పత్రికి వచ్చి ప్రాణాలు తీసుకున్నాం' అంటూ శాపనార్థాలు పెట్టారు. మనిషి ప్రాణాలను కాపాడలేని వాళ్ల దగ్గరకు వచ్చామంటూ కంటతడి పెట్టారు. ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నా వైద్యాధికారులు నిర్లక్ష్యానికి తార్కాణానికి నిదర్శనంగా నిలిచిన ఈ ఘటనకు సంబంధించి ఓ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

మరణంలోనూ వీడని బంధం

వారిద్దరూ చిన్ననాటి స్నేహితులు, ఒకరినొకరు విడిపోకూడదని ఉపాధి కూడా ఒకే చోట వెతుక్కున్నారు. ఎక్కడికి వెళ్లినా ఒకటిగానే వెళ్లేవారు. స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి దుర్మరణం చెందడం కుటుంబ సభ్యులు, సహా మిత్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది. నగరి రూరల్ మండలం తడుకుపేట వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది.

- రోడ్డు ప్రమాదంలో స్నేహితుల మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- పెళ్లికి హాజరయ్యేందుకు వస్తుండగా తడుకు పేట వద్ద ఘటన


మిత్రులిద్దరి ఫొటోలతో కన్నీటి వీడ్కోలు ఫ్లెక్సీ, ఇళంగన్, కన్నన్ మృతదేహాలు

నగరి: నగరి రూరల్ మండలం తడుకుపేట వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లా నైనార్ కోయిల్ గ్రామానికి చెందిన ఇళంగన్ (27), కన్నన్ (28) మృతిచెందగా, నగరి మున్సిపాలిటీ సత్రవాడకు చెందిన సంజయ్ (29) తీవ్రంగా గాయపడ్డాడు. మృతుని బంధువుల కథనం మేరకు.. చిన్ననాటి నుంచి ఇళంగన్, కన్నన్ మిత్రులు. వీరు ఉపాధి కూడా ఒకే చోట వెతుక్కున్నారు. చెన్నైలోని ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. వీరు తిరుపతిలో జరిగే సహ ఉద్యోగి వివాహానికి హాజరయ్యేందుకు పని ముగించుకొని మరో మిత్రుడు నగరికి చెందిన సంజయ్‌తో కలిసి ముగ్గురు ఒకే బైక్‌పై బయలుదేరారు. రాత్రి కావడంతో నగరి రూరల్ మండలం తడుకు పేట వద్ద అదుపుతప్పి రోడ్డుపై నిలిచి ఉన్న బొలేరో వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇళంగన్, కన్నన్ ఘటన స్థలంలోనే మృతి చెందగా, సంజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఉన్నత వైద్య చికిత్స నిమిత్తం చెన్నైకి తరలించారు. విషయం తెలిసిన మృతుల బంధువులు, మిత్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. నైనార్ కోయిల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కన్నీటి వీడ్కోలు ఫ్లెక్సీలో మిత్రులిద్దరినీ ఒక్కటిగానే ఉంచడంతో చూసినవారి గుండెలు తరుక్కుపోయాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

బోయకొండ గంగమ్మా..పాహిమాం


అన్న ప్రసాదాల పంపిణీ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. గంగమ్మ తల్లీ శరణు అంటూ పూజల్లో పాల్గొన్నారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి, ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల సమయంలో అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు ఉపవాస దీక్షలతో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించి తరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్న ప్రసాదాల పంపిణీ

ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ పర్యవేక్షణలో సుమారు 2 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం బోయకొండ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకొన్న చోట జరుగుతున్న మరమ్మతు పనులను ఈఓ, చైర్మన్ పరిశీలించి తగు సూచనలు చేశారు.

మొదటి ఘాట్‌లో ప్రమాదాలు


బోల్తా పడిన వ్యాన్

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం పలు ప్రమాదాలు జరిగాయి. వివరాలు.. తమిళనాడుకు చెందిన భక్తులు మినీవ్యాన్‌లో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కిందకు దిగుతుండగా మాల్వాడిగుండం సమీపంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని కొందరు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వ్యాన్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ప్రమాద సమయంలో అటుగా వస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. అలాగే ఘాట్ 19వ మలుపు వద్ద తమిళనాడుకు చెందిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ క్రమంలోనే టీటీడీ వాటర్ ట్యాంకు కూడా డివైడర్‌ను ఢీకొంది.

విమానంలో విహారయాత్రకు విద్యాకుసుమాలు

సత్యవేడు: మాధనపాళెం జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిస్తే విమానంలో విహార యాత్రకు పంపుతానని సురుటుపల్లె ఆలయ కమిటీ సభ్యుడు ఉమాపతి ప్రకటించిన విషయం విధితమే. అందులో భాగంగా విద్యార్థులు పురుషోత్తం(552), వి. విష్ణు(515),మహా(509), తనూజ(505)తోపాటు ప్రధానోపాధ్యాయుడు మునిమోహన్‌ను శుక్రవారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు విమానంలో పంపించారు.
టికెట్లతోపాటు విద్యార్థుల రెండు రోజుల విహార యాత్రకు అయ్యే మొత్తం ఖర్చును ఉమాపతే భరిస్తున్నారు. ఈ మేరకు ఉమాపతిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

వరసిద్ధుని సేవలో తిరుపతి జిల్లా కలెక్టర్


కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం సేవించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆలయ మర్యాద చేశారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు కోదండపాణి, బాబు పాల్గొన్నారు.

పెంచలకోనకు ప్రత్యేక బస్సులు


అనిల్‌కుమార్, రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్

రాపూరు: మండలంలోనిపెంచలకోన బ్రహ్మోత్సవాలకు 120 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు, గూడూరు, రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి, వాకాడు, కావలి, వెంకటగిరి, గూడూరు, వైఎస్సార్ జిల్లా కడప, మైదుకూరు, రాజంపేట, బద్వేల్ నుంచి ప్రత్యేక బస్సులను శనివారం నుంచి నడపనున్నట్లు వివరించారు. 22న నృసింహ జయంతి, 23న శ్రీవారి కల్యాణం నేపథ్యంలో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశముందని, ఆ మేరకు బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. అన్ని బస్సుల్లో మామూలు చార్జీలనే వసూలు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి


మృతి చెందిన సురేష్

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలమనేరుకు చెందిన ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి బెంగళూరు వెళుతున్న లారీ మొగిలి ఘాట్‌లో జాతీయ రహదారి మధ్యలో నిలిచిపోయింది. అదే సమయంలో చిత్తూరు నుంచి పలమనేరుకు వెళ్తున్న ద్విచక్ర వాహనం లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో పలమనేరు పట్టణం పాతపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన మురుగేష్ కుమారుడు సురేష్(21) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. ఏఎస్‌ఐ మల్లెమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుబాంబు పేలి పెంపుడు కుక్కకు గాయాలు


గాయపడిన కుక్క

చౌడేపల్లె: దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లె సమీపంలో శుక్రవారం నాటుబాంబు పేలి పెంపుడు కుక్కకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు చెంగారెడ్డి పెంపుడుకుక్కను పెంచు కుంటున్నాడు. శుక్రవారం ఇంటికి సమీపంలో ఉన్న ఒక రైతు మామిడితోటలోకి కుక్క వెళ్లింది. కొద్దిసేపటికి పెద్ద పేలుడు శబ్దం వచ్చింది. చెంగారెడ్డి అక్కడికి వెళ్లి చూడగా నాటు బాంబు పేలి కుక్క తీవ్రంగా గాయపడి ఉంది. దవడ భాగం చీలిపోయి ఉంది. వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు పాతిపెట్టిన నాటుబాంబును కొరకడంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెంగారెడ్డి తెలిపారు.

ఆముదాలకోనలో ఒంటరి ఏనుగు!


ఏనుగు పాదముద్రలు

చంద్రగిరి : మండలంలోని ఆముదాల కోన వద్ద అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తున్నట్లు పనపాకం రేంజ్ డీఆర్‌ఓ చిన్నబాబు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం అటవీప్రాంతంలో ఆయన పర్యటించి ఏనుగు కాలి గుర్తులను పసిగట్టారు. గతంలో తవణంపల్లె, పాకాల వద్ద ఇద్దరిని హతమార్చింది ఈ ఏనుగే అని గుర్తించామని డీఆర్‌ఓ వెల్లడించారు. ఈ మేరకు ఆముదాల కోన ఎస్టీ కాలనీ, కల్‌రోడ్డుపల్లె, మిట్టూరు, కాశిపెంట్ల, కొత్త ఇండ్లు గ్రామాల్లోని ప్రజలకు తీసుకోవాల్సిన అవగాహన కల్పించారు. ఒంటరి ఏనుగు ఎక్కడ కనిపించినా వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఏనుగును దారి మళ్లించేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

పిచ్చాటూరు : స్థానిక పీహెచ్‌సీ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. శివగిరి ఏఏడబ్ల్యూకు చెందిన మాతయ్య(22) ద్విచక్రవాహనంపై పిచ్చాటూరుకు వస్తుండగా శ్రీరామాపురం వెళుతున్న బస్సు ఢీకొంది. దీంతో మాతయ్య అక్కడికక్కడే మరణించాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరు జాతరకు వేళాయే..

- కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లి
- గంగ జాతరకు 300 ఏళ్ల చరిత్ర
- 20న శిరస్సు మెరవణి, 22న విశ్వరూప దర్శనం
- మొదలైన పండుగ సందడి


మారెమ్మ ఆలయం వద్ద పొంగళ్లు (ఇన్‌సెట్) మెరవణి చేపట్టే అమ్మవారి శిరస్సు

పలమనేరు: జిల్లాలోనే పలమనేరులో జరిగే తిరుపతి గంగమ్మ జాతరకు ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంతం గతంలో తమిళనాడు రాష్ట్రంలోని నార్త్ ఆర్కాట్ జిల్లాలో ఉన్నప్పటి నుంచి ఇక్కడ జాతర జరుగుతోంది. ఈజాతరకు స్థానికులే కాకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్న స్థానికులు సైతం వస్తుంటారు. జిల్లాలోని జాతర్లకు విభిన్నంగా ఇక్కడి జాతరలో అమ్మవారి శిరస్సు మెరవణి కార్యక్రమం ప్రత్యేకంగా జరుగుతుంది. అమ్మవారి శిరస్సును తాకేందుకు జనం ఆసక్తిని చూపుతుంటారు. జాతరకు ముందు పట్టణంలో గంగచాటు పెట్టినప్పటి నుంచి పట్టణంలో పండుగ సందడి మొదలవుతుంది. అప్పటినుంచి స్థానిక మారెమ్మ, గంగమ్మ ఆలయాల వద్ద మహిళలు పొంగళ్లను పెట్టడం ఆనవాయితీ. అప్పటినుంచి జాతర వరకు అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తుంటారు. పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాలనుంచి ప్రజలు పొంగళ్లు పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వస్తుంటారు. ఇక పట్టణంలోని కుల సంఘాలు వారు రోజుకొక్కరు చొప్పున ప్రత్యేక పూజలు, అన్నదానాలను చేయడం ఆనవాయితీ.

శిరస్సు మెరవణిలో లక్షల్లో టెంకాయలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగే జాతర్లకు భిన్నంగా ఇక్కడ బంగారు పూత పూసిన అమ్మవారిని శిరస్సును పట్టణంలో ఊరేగిస్తారు. ఈ తంతు పట్టణంలోని పాతపేట వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అనాధిగా వస్తోంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి లక్షల్లో టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకుంటారు.

ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు..


పలమనేరు పట్టణంలో ఈనెల 20 నుంచి 22 దాకా మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా సాగే తిరుపతి గంగమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవాదాయశాఖాధికారులు ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లను చేపట్టారు. విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానంగా అలంకరణలు చేశారు. చలువపందిళ్లు, భారీ క్యూలు ఏర్పాటు చేశారు. మరోవైపు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు భక్తులు విచిత్ర వేషధారణలతో ఇప్పటికే ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలో దుకాణాలు పెద్ద సంఖ్యలో ఏర్పడ్డాయి. మరోవైపు పొరుగునే ఉన్న మారెమ్మ ఆలయంలో పొంగళ్ల నివేదన కార్యక్రమం నిత్యం ఘనంగా సాగుతోంది.


అమ్మవారికి అభిషేకం, అన్నదానం...

స్థానిక గంగమ్మ ఆలయం వద్ద శుక్రవారం రెడ్డిసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. సంప్రదాయ దుస్తులను ధరించి వారంతా పూజల్లో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. యోగివేమారెడ్డి ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం స్థానిక వడ్డెర సంఘం, మాజీ సైనికోద్యోగులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు చేపట్టారు. పట్టణంలో ఎటు చూసినా సందడి నెలకొంది.

భారీ బందోబస్తు

జాతరను శాంతియుతంగా నిర్వహించేందుకు భారీగా పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. చిన్నపిల్లల కోసం భారీ రంగుల రాట్నాలు, జాయింట్ వీలర్లను ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు ఆలయం వద్ద అవసరమైన సౌకర్యాలను చేపట్టారు. పలు చర్యలు తీసుకున్నారు. అమ్మవారి జలధి చేసే చోట అవసరమైన పనులను చేపట్టారు. పట్టణంలో ఎటు చూసినాజాతర సందడి కనిపిస్తోంది.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రెడ్డి సంఘం నేతలు


అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేసేందుకు వస్తున్న భక్తులు

పక్కాగా 'విద్యాహక్కు'

- పేద పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య
- జిల్లాలో 827 మంది విద్యార్థులు ఎంపిక
- ఈ నెల 20లోపు అడ్మిషన్లు
- తొలి జాబితా విడుదల చేసిన విద్యాశాఖ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1) (సి) ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం మంది విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ఇవ్వాలి. దీనికి అనుగుణంగా ప్రభుత్వం 2024–25వ విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జిల్లాలోని 34మండలాలకు గాను 31మండలాల నుంచి 1,407మంది పేద విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నిబంధనలకు లోబడి ఉన్న 1,024మంది దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని అందులో 827మందిని ఎంపిక చేస్తూ విద్యాశాఖ మొదటి విడత జాబితాను విడుదల చేసింది.


జిల్లాలో ఎంపిక ఇలా..

విద్యాహక్కు చట్టం ప్రకారం సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో జిల్లాలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు ఐబీ, ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్‌లు అమలుచేస్తున్న జిల్లాలోని 402 ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నాయి. అనంతరం ఆయా పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు 25శాతం సీట్లను కేటాయించాలి. అందులో భాగంగానే విడుదల చేసిన తొలి విడత జాబితాలో 827మంది విద్యార్థులు సీట్లు పొందనున్నారు.

20లోపు అడ్మిషన్లు పొందాలి

విద్యాశాఖ విడుదల చేసిన జాబితా మేరకు జిల్లాలోని ఎంపిక చేసిన 827మంది విద్యార్థుల్లో ఇప్పటికే 600మందికి పైగా అడ్మిషన్లు పొందారు. మిగిలిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు ఎంపికైన పాఠశాలలకు వెళ్లి సంబంధిత ధ్రువీకరణపత్రాలను సమర్పించి అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి



ఉచిత విద్యాహక్కు చట్టం మేరకు పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఇప్పటికే తొలివిడత జాబితాలో 827మంది లబ్ధి పొందగా, వారిలో 600కుపైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన వారు ఈ నెల 20వ తేదీలోపు ఎంపికైన ఆయా పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్లు పొందాలి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– శేఖర్, డీఈఓ, తిరుపతి